క్లుప్తంగా

తెలంగాణ గ్రామీణ బ్యాంక్ పేరుతో సేవలు

అర్వపల్లి : ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్‌బ్యాంక్ ఇక నుంచి తెలంగాణ గ్రామీణ బ్యాంక్ (టీజీబీ) పేరుతో సేవలందించనుందని ఆ బ్యాంక్ అర్వపల్లి శాఖ మేనేజర్ గణేషన్ నటరాజన్ తెలిపారు. గురువారం స్థానికంగా బ్యాంక్‌లో ఖాతాదారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏపీజీవీబీ టీజీబీలో విలీనం అవుతుందని, ఈ క్రమంలో ఏర్పడే సాంకేతిక సమస్యల కారణంగా ఈనెల 28నుంచి 31వరకు బ్యాంక్ సేవలలో అంతరాయం ఏర్పడుతుందన్నారు. ఖాతాదారులు ఈలోపే తమ లావాదేవీలను చేసుకోవాలని సూచించారు. జనవరి 1నుంచి టీజీబీ బ్యాంక్‌ల సరసన చేరుతుందని తెలిపారు. సమావేశంలో బ్యాంక్ ఫీల్డ్ అధికారి శ్రీమాన్, క్యాషియర్ వినయ్‌కుమార్, ఖాతా దారులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌ఐ రత్నం

చివ్వెంల : విద్యార్థులు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ రత్నం అన్నారు. గురువారం మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగహన కల్పించారు. విద్యార్థులు డ్రగ్స్, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. సైబర్ మోసాలపై 1930 నంబర్, బాలికలు వేధింపులకు గురైతే 100కు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ సందర్భంగా పోలీస్ కళాజాత ఆధ్వర్యంలో ఆట పాట ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రమేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కలిసికట్టుగా పండుగ జరుపుకోవాలి


మాట్లాడుతున్న మాజీ జెడ్పీటీసీ పూలమ్మ

నాగారం : మండలంలోని ఈటూరు గ్రామంలో త్వరలో నిర్వహించబోయే బొడ్రాయి పండగను కలిసికట్టుగా, రాజకీయాలకు అతీతంగా జరుపుకోవాలని మాజీ జెడ్పీటీసీ పేరాల పూలమ్మ కోరారు. గురువారం గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలో నిర్వహించిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. చాలా కాలంగా గ్రామ ప్రజలంతా బొడ్రాయి పండగ కోసం ఎదురుచూస్తున్నారని, గ్రామంలో యువజన సంఘాలు, ఉద్యోగులు, గ్రామ ప్రజలంతా ఘర్షణలకు తావు లేకుండా వేడుకను జరుపుకోవాలని సూచించారు. సమావేశంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

క్షేత్ర పర్యటనతో బోధన


చెరువుపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

నూతనకల్ : మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 6వతరగతి విద్యార్థులకు క్షేత్ర పర్యటనతో తెలుగు పాఠ్యాంశాన్ని బోధించారు. విద్యార్థులకు తెలుగు–చెరువు అనే పాఠ్యాంశాన్ని ఉపాధ్యాయులు గురువారం మండల కేంద్రంలోని శంభుని చెరువు వద్దకు తీసుకెళ్లి చెరువుతో వ్యవసాయానికి సాగునీరు, పశుపక్షాదులకు తాగునీరు, చేపల పెంపకంతో పాటు వివిధ రకాల ఉపయోగాలను వివరించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు యాస రాంకుమార్‌రెడ్డి, శెనగాని ఎల్లమ్మ, పిట్టల మంగమ్మ, నాగిరెడ్డి ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.

దాతల సహకారం అభినందనీయం


అల్పాహారం అందిస్తున్న దాత

ఆత్మకూర్(ఎస్) : పదోతరగతి విద్యార్థులకు సాయంత్రం అదనపు తరగతుల సమయంలో అల్పాహారం అందించేందుకు దాతలు ముందుకు రావడం అభినందనీయమని, దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకొని విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలని పాఠశాల హెచ్‌ఎం శ్రవణ్‌కుమార్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదోతరగతి చదువుతున్న విద్యార్థులకు సాయంత్రం అల్పాహారం అందించేందుకు కాంగ్రెస్ నాయకుడు బద్దం ప్రవీణ్‌రెడ్డి రూ.4వేలతో బిస్కెట్లు ఇతర వస్తువులను అందించారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌రెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు తంగెళ్ల లక్ష్మీకాంతరెడ్డి, జలగం మల్లేష్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

పీఎంశ్రీ పథకానికి మోక్షం

- రూ.27లక్షలతో అదనపు తరగతి గదుల నిర్మాణం
- పాఠశాలలో ఎట్టకేలకు మొదలైన పనులు


అర్వపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌లో అదనపు గదుల నిర్మాణానికి వేసిన శిలాఫలకం



పీఎంశ్రీ పథకం అమలవుతున్న అర్వపల్లి జెడ్పీహెచ్‌ఎస్

అర్వపల్లి : గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు వారిలో నైపుణ్యాలను పెంపొందించడానికి కేంద్రం ప్రభుత్వం ఏడాదిన్నర కిందట ప్రధానమంత్రి స్కూల్ ఫర్ రైజింగ్ ఇండియా (పీఎంశ్రీ) యోజన పథకానికి శ్రీకారం చుట్టింది. ఈ పథకంలో భాగంగా అర్వపల్లి జెడ్పీహెచ్‌ఎస్ ఎంపికను చేశారు. దీంతో పాఠశాలలో ఎట్టకేలకు పలు అభివృద్ధి పనులు మొదలయ్యాయి. ఈ పథకంలో ఇక్కడి పాఠశాలలో రెండు అదనపు తరగతి గదుల నిర్మాణానికి అప్పట్లోనే నిధులు మంజూరు కాగా స్థానిక ఎమ్మెల్యే సామేలు 10నెలల కిందట శిలాఫలకం వేశారు. అయితే ఈ పనులు ఇప్పుడు ఎట్టకేలకు ప్రారంభమయ్యాయి.

పథకం ప్రయోజనాలు

ఈ పథకం కింద ఎంపికైన పాఠశాలలకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక నిధులను పీఎంశ్రీ పథకం కింద నేరుగా అందించనుంది. ప్రధానంగా ఆయా పాఠశాలలకు అవసరమైన అన్ని రకాల మౌలిక సదుపాయాలు, స్మార్ట్ తరగతి గదులు, డిజిటల్ విద్యా బోధన, మెరుగైన క్రీడా సౌకర్యాలు, ఆధునిక ప్రయోగశాలలు వంటి అంశాలలో ఉన్నత స్థాయిలో తీర్చిదిద్దనున్నారు.

రూ.27లక్షలతో రెండు గదుల నిర్మాణం..

జాజిరెడ్డిగూడెం మండలంలోని అర్వపల్లి పాఠశాలలో అత్యధికంగా 350మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. అయితే పీఎంశ్రీ పథకంలో రెండు అదనపు తరగతి గదుల నిర్మాణానికి రూ.27లక్షలు మంజూరు కాగా పనులను ప్రారంభించారు. ఈ అదనపు గదుల నిర్మాణంతో పాటు పాఠశాలలో ఇతర మౌలిక వసతులు కూడా కల్పించనున్నారు. ఇప్పటికే పాఠశాల నిర్వహణకు కూడా నిధులు ఈ పథకంలో విడుదల చేస్తున్నారు. ఈ అదనపు గదుల నిర్మాణం పూర్తయితే విద్యార్థులకు మరింత సౌకర్యంగా ఉండనుంది. అదే విధంగా మౌలిక వసతుల కల్పనకు ఇంకా కొన్ని నిధులు మంజూరు కావాల్సి ఉంది.

వసతులు కల్పిస్తున్నారు



మా పాఠశాలలో అన్ని వసతులు కల్పిస్తున్నారు. కొత్తగా అదనపు తరగతి గదుల నిర్మాణం జరుగుతుంది. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా మా పాఠశాలలో విద్యా బోధన చేస్తున్నారు.

– కుంభం సిద్ధు, విద్యార్థి

పనులు ప్రారంభమయ్యాయి



పీఎంశ్రీ పథకంతో పాఠశాలలో రూ.27లక్షలతో అదనపు తరగతి గదుల నిర్మాణం పనులు ప్రారంభమయ్యాయి. ఈ పథకంలో మౌలిక వసతులకు నిధులు మంజూరు కావాల్సి ఉంది. మన ఊరు–మన బడి పథకం పనులు కూడా పూర్తి కావస్తున్నాయి.

– ఎం.విజయలక్ష్మి, హెచ్‌ఎం

17న ధర్మాగ్రహ దీక్షకు తరలిరావాలి


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న టీపీయూఎస్ నాయకులు

సూర్యాపేట : పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలు, పీఆర్సీ వెంటనే ప్రకటించాలని, పెండింగ్ బిల్లులన్నీ చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 17న టీపీయూఎస్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద చేపట్టనున్న ధర్మాగ్రహ దీక్షకు ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో తరలిరావాలని ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పర్వతం సంధ్యారాణి, యమా రమేశ్ పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద రాష్ట్ర స్థాయి ధర్నా (ధర్మాగ్రహ దీక్ష) కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను వారు ఆవిష్కరించి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం పూర్తయినా ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తున్నందున టీపీయూఎస్ ఆధ్వర్యంలో ఉద్యమ కార్యాచరణ రూపొందించినట్లు తెలిపారు. జీవో 317 సమస్యపై పాత జీవోలు ఇచ్చి నిరాశపరిచారని, అశాస్త్రీయమైన జీవో 317ను రద్దు చేసి స్థానికతకు ప్రాధాన్యత ఇవ్వాలని, జోనల్ వ్యవస్థను పునఃసమీక్షించి ఉపాధ్యాయ పోస్టులను జోనల్ పోస్టులుగా మార్చాలన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు బ్రాహ్మాచారి, తిరుమలేష్, రవికుమార్, దేవరాజు, సాయికుమార్, శ్రీనివాసాచారి, పూల్‌సింగ్, వెంకట్‌రెడ్డి, కోటిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

నెమ్మికల్ పశువుల సంత వేలం వాయిదా

ఆత్మకూర్(ఎస్) : మండలంలోని నెమ్మికల్‌లో నిర్వహించిన పశువుల సంత వేలం పాట అధికారులు, గ్రామస్తుల మధ్య ఏర్పడిన స్వల్ప వివాదంతో వాయిదా వేస్తున్నట్లు ఎంపీఓ రాజేష్‌గౌడ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలం పాటలో ఏపీఓ ఈశ్వర్, నాయకులు సత్యం, యడవెల్లి ముత్తయ్య, చక్రయ్య, వేల్పుల వెంకన్న, ఉపేందర్, బొల్లెపాక సైదులు, కరుణాకర్, రేపాక వెంకట్‌రెడ్డి, ముత్తయ్య, లింగయ్య, ప్రకాష్, మధు, భిక్షం, లింగయ్య, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గురుకులాల్లో సమస్యలను పరిష్కరించాలి


సాంఘిక సంక్షేమ హాస్టల్‌లో విద్యార్థుల సమస్యలు తెలుసుకుంటున్న నాయకులు

సూర్యాపేటటౌన్ : గురుకులాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధనియాకుల శ్రీకాంత్‌వర్మ అన్నారు. గురువారం పట్టణంలోని పలు గురుకుల పాఠశాలలు, కళాశాలలను ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు సందర్శించి విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గురుకులాలకు పక్కా భవనాలు లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. ఎస్సీ గురుకులంలో వాటర్‌ట్యాంక్ లేకపోవడంతో డైరెక్ట్ మోటార్ సహాయంతో విద్యార్థులు నీటిని వాడుకుంటున్నారని, పాఠశాల సమయానికి స్నానాలు చేయలేని పరిస్థితి నెలకొంటుందన్నారు. పాఠశాలలో డ్రైయినేజీ పైప్‌లైన్ వ్యవస్థ లేకపోవడంతో మురుగు నీరు నిల్వ ఉంటుందన్నారు. టెండర్‌తో గురుకులాలకు సరుకులు సరఫరా చేస్తున్నా వారు నాసిరకమైన ఆహార పదార్థాలు ఇవ్వకుండా చర్యలు చేపట్టాలన్నారు. అదే మాదిరిగా చలికాలం కావడంతో విద్యార్థులకు వేడి నీటిని, స్వెటర్లను ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి బానోత్ వినోద్‌కుమార్, జిల్లా నాయకులు శ్రీను నాయక్, వినయ్, శ్రవణ్, సుమన్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న సమగ్ర శిక్షా ఉద్యోగుల దీక్ష


దీక్షకు మద్దతు తెలుపుతున్న సంధ్యారాణి

భానుపురి (సూర్యాపేట) : తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ కలెక్టరేట్ ఎదుట చేపట్టిన సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగుల రిలే నిరాహార దీక్షలు గురువారం కొనసాగాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ దీక్షకు తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షురాలు పర్వతం సంధ్యారాణి మద్దతు తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి వెంకటరమణ, కోశాధికారి లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షుడు రాంబాబునాయక్ తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం


లబ్ధిదారులకు కోడిపిల్లలు పంపిణీ చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

నూతనకల్ : సమభావన సంఘాల్లో ఉన్న ప్రతి మహిళా ఆర్థికంగా అభివృద్ధి చెందడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో మహిళ శక్తి పథకంలో భాగంగా 17మంది లబ్ధిదారులకు కోడిపిల్లలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మహిళలకు ప్రభుత్వం వివిధ పథకాల ద్వారా రుణాలు అందిస్తున్నట్లు, అందులో భాగంగా కోళ్ల పెంపకంతో పాటు వివిధ రకాల చేతివృత్తులకు ఆర్థిక సహకారం అందిస్తుందని తెలిపారు. కోళ్ల పెంపకంతో ఒక యూనిట్‌కు 50కోడిపిల్లలను అందజేస్తున్నట్లు, ప్రభుత్వం అందిస్తున్న ప్రతి పథకాన్ని మహిళలు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా బలోపేతం కావాలన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ నాగం జయసుధసుధాకర్‌రెడ్డి, ఎంపీడీఓ సునీత, పశువైద్యాధికారి రవి, ఏపీఎం కమలాకర్, సీసీలు ముత్తయ్య, భాగ్యలక్ష్మి, శ్రీకాంత్, అనిల్, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తులపై అధికారుల సర్వే

అర్వపల్లి : మండల పరిధిలోని నాన్యతండా, కోమటిపల్లి, తిమ్మాపురం తదితర గ్రామాలలో గురువారం చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల సర్వేను ఎంపీఓ గోపి పరిశీలించారు. కార్యక్రమంలో టీఏ నాగమణి, ఫీల్డ్ అసిస్టెంట్ సైదులు ఉన్నారు.

నాగారం : మండల కేంద్రంలో ఇందిరమ్మ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో గురువారం ఇందిరమ్మ ఇళ్ల సర్వేను ప్రారంభించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్ మాట్లాడారు. ప్రతి ఇంటికి ఇందిరమ్మ కమిటీ బృందం వెళ్లి దరఖాస్తుదారుల వివరాలు తెలుసుకుని యాప్‌లో నమోదు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు జాజుల వీరయ్య, మంగదుడ్ల గంగమ్మదశరథ, చిప్పలపల్లి లక్ష్మీమల్హార్, కన్నెబోయిన సావిత్రి వెంకటభిక్షం, సిబ్బంది ఉన్నారు.

మద్దిరాల : మండల కేంద్రంతో పాటు మండలంలోని ఆయా గ్రామాలలో ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తులపై సర్వే నిర్వహించారు. గురువారం మండలంలోని చందుపట్ల, జి.కొత్తపల్లితో పాటు వివిధ గ్రామాలలో నిర్వహించిన సర్వేను ఎంపీడీఓ సత్యనారాయణరెడ్డి పరిశీలించారు. ఆయన వెంట కార్యదర్శులు ఉమ, తేజశ్రీ, గ్రామస్తులు ఉన్నారు.

సంక్షిప్త సమాచారం

అంగన్‌వాడీలను సద్వినియోగం చేసుకోవాలి

నూతనకల్ : అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న సేవలను చిన్నారులు, గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని స్థానిక పాఠశాల హెచ్‌ఎం సోమయ్య అన్నారు. గురువారం మండల పరిధిలోని చిల్పకుంట్ల అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు బండపల్లి అరుణ, బత్తుల రేణుక, ఉపాధ్యాయులు, భాగ్యమ్మ, ప్రసన్న, సౌనయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల కేంద్రంలోని న్యూ ఇవాంజలిజం మినిస్ట్రీస్ చర్చి ఆధ్వర్యంలో గురువారం రాత్రి 20వ సెమీ క్రిస్మస్ సంబరాలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి అన్నదానం చేశారు. కార్యక్రమంలో పాస్టర్ డేవిడ్‌రాజు, చర్చి వ్యవస్థాపకుడు రెంటాల కరుణకుమార్, ఎడ్ల ముక్కంటి, విజయశ్రీ, రూతమ్మ, అక్కులు, సోమయ్య, వినోదరావు, ఉపేంద్ర, సుధీర్, పూజ, సౌమ్య, ఉపేంద్ర, లలిత, నాగమ్మ, ప్రకాష్, శ్రీధర్, గ్రేసమ్మ, తదితరులు పాల్గొన్నారు.

గణిత టాలెంట్ టెస్టులో విద్యార్థి ప్రతిభ

నూతనకల్ : సూర్యాపేటలో నిర్వహించి జిల్లా స్థాయి గణిత టాలెంట్ టెస్టులో మండల పరిధిలోని తాళ్లసింగారం జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించి రాష్ట్రస్థాయి టాలెంట్ టెస్టుకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం జి.సోమయ్య తెలిపారు. గురువారం నిర్వహించిన పోటీల్లో ఎం.పవన్‌సూర్య రెండో స్థానం సాధించి రాష్ట్రస్థాయికి ఎంపిక కావడంతో అతడిని ఉపాధ్యాయులు అభినందించారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

తుంగతుర్తి : మండల కేంద్రానికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు, తెలంగాణ ఉద్యమకారుడు ఓరుగంటి సత్యనారాయణ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. గురువారం మాజీ ఎంపీ డాక్టర్ బూర నర్సయ్యగౌడ్ మృతుడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కడియం రామచంద్రయ్య, వెంకటనారాయణ, రిటైర్డ్ టీచర్ పాలవరపు సంతోష్ తదితరులు ఉన్నారు.

ముగిసిన సీఎం కప్ మండల స్థాయి క్రీడలు


అర్వపల్లి : ఖోఖో ఆడుతున్న బాలికలు


పెన్‌పహాడ్ : కబడ్డీ ఆడుతున్న బాలికలు


ఆత్మకూర్(ఎస్) : విజేతలకు బహుమతులు అందజేస్తున్న అధికారులు

పెన్‌పహాడ్ : మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాల ఆవరణంలో నిర్వహించిన సీఎం కప్ మండల స్థాయి పోటీలు గురువారం ముగిశాయి. ఈ సందర్భంగా క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. బాలిక కబడ్డీ పోటీల్లో పెన్‌పహాడ్ మొదటి బహుమతి, వాలీబాల్‌లో గాజులమల్కాపురం మొదటి బహుమతి, అథ్లెటిక్స్‌లో షాట్‌పుట్‌లో అనూష, డిస్కస్త్రో ప్రశాంతి, పరుగు పోటీల్లో (100మీ, 200, 400మీటర్ల) విభాగంలో పూజ, జూనియర్ పరుగు పోటీల్లో పావని, లాంగ్‌జంప్ మారథాన్ మొదటి స్థానంలో నిలిచి జిల్లా స్థాయికి ఎంపికైనట్లు ఎంపీడీఓ వెంకటేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ నకిరేకంటి రవి, ఎంపీఓ సంజీవయ్య, పంచాయతీ కార్యదర్శి నాగరాజు, పీడీలు రామ్మోహనచారి, మధుసూదన్‌రెడ్డి, సునీత, రవి, ఉపాధ్యాయులు ఆనందభాస్కర్, పావని, చారి పాల్గొన్నారు.

ఆత్మకూర్(ఎస్) : మండల కేంద్రంలో నిర్వహించిన సీఎం కప్ మండల స్థాయి క్రీడలు గురువారం ముగిశాయి. బాల బాలికలు కబడ్డీ, వాలీబాల్, షటిల్‌తో పాటు షాట్‌పుట్, లాంగ్‌జంప్, హైజంప్ క్రీడల్లో పాల్గొని విజేతలుగా నిలిచారు. ఈ సందర్భంగా వారికి నిర్వాహకులు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మండల తహసీల్దార్ హరిచంద్రప్రసాద్, ఎంపీడీఓ హసీం, వివిధ పాఠశాలల పీఈటీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

అర్వపల్లి : అర్వపల్లి జెడ్పీ పాఠశాల ఆవరణలో నిర్వహించిన సీఎం కప్ మండల స్థాయి క్రీడలు గురువారంతో ముగిశాయి. ఈ సందర్భంగా బాల బాలికలు వాలీబాల్, కబడ్డీ, ఖోఖో పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబర్చారు. వాలీబాల్‌లో అర్వపల్లి జెడ్పీహెచ్‌ఎస్ ప్రథమ, జాజిరెడ్డిగూడెం ద్వితీయ, కబడ్డీలో అర్వపల్లి ప్రథమ, పర్సాయపల్లి ద్వితీయ బహుమతులు సాధించి జిల్లా స్థాయికి ఎంపికయ్యాయి. కార్యక్రమంలో ఎంఈఓ బాలునాయక్, పీడీలు ఉన్నారు.

విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో రాణించాలి


నాగారం : క్రీడలను ప్రారంభిస్తున్న అధికారులు

నాగారం : విద్యార్థులు చదువులతో పాటు క్రీడల్లోను రాణించాలని తహసీల్దార్ వి.బ్రహ్మయ్య అన్నారు. గురువారం మండల కేంద్రంలోని జెడ్పీ హెచ్‌ఎస్‌లో నిర్వహిస్తున్న సీఎం కప్ మండల స్థాయి క్రీడాలను ప్రారంభించి మాట్లాడారు. తల్లిదండ్రులు తమపిల్లలను పాఠశాల స్థాయి నుంచే క్రీడల్లో రాణించేలా ప్రోత్సహించాలన్నారు. అనంతరం యువతి, యువకులకు, విద్యార్థులకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ క్రీడలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కె.మారయ్య, మండల విద్యాధికారి వాసం ప్రభాకర్, పీడీ చెగోని కృష్ణమూర్తి, జీహెచ్‌ఎం జ్ఞానేశ్వరచారి, వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

మద్దిరాల : క్రీడలతో విద్యార్థులలో మానసిక ఉల్లాసం పెరుగుతుందని తహసీల్దార్ అమీన్‌సింగ్ అన్నారు. ప్రభుత్వ ప్రజా పాలన విజయోత్సవ కార్యక్రమంలో భాగంగా గురువారం మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సీఎం కప్ క్రీడా పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులకు విద్యతో పాటు క్రీడలు కూడా ముఖ్యమన్నారు. కార్యక్రమంలో ఏంఈఓ తండు వెంకటనారాయణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలపై అభ్యంతరాలు తెలపాలి


పెన్‌పహాడ్ : సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ వెంకటేశ్వరరావు


నాగారం : సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ కె.మారయ్య

పెన్‌పహాడ్ : త్వరలో జరగనున్న గ్రామపంచాయతీ ఎన్నికల సందర్భంగా పోలింగ్ కేంద్రాల ఏర్పాటు ముసాయిదా జాబితాపై అభ్యంతరాలు ఉంటే తెలపాలని ఎంపీడీఓ వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో వివిధ పార్టీల నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నాయకుల నుంచి పలు సలహాలు, సూచనలు అడిగి తెలుసుకున్నామన్నారు. సమావేశంలో వివిధ పార్టీల నాయకులు తూముల సురేష్‌రావు, గుంజా వెంకటేశ్వర్లు, పోకల రాములు, అలీసాబ్, శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

ముసాయిదా జాబితాపై సమావేశం

తిరుమలగిరి : మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గ్రామపంచాయతీ సాధారణ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల ముసాయిదా జాబితా, పోలింగ్ కేంద్రాల ఏర్పాటుపై అన్ని ప్రధాన పార్టీల నాయకులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ లాజరస్ పాల్గొని మాట్లాడారు. వారుకో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి భీమ్‌సింగ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నాగారం : త్వరలో జరగబోయే గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల ఏర్పాటుపై గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో రాజకీయ పార్టీల నాయకులతో ఎంపీడీఓ కె.మారయ్య సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ముసాయిదా పోలింగ్ స్టేషన్ల వివరాలపై గుర్తింపు పొందిన రాజకీయ నాయకులను సలహాలు, సూచనలు, అభ్యంతరాలు ఉంటే తెలపాలని కోరారు. సమావేశంలో సూపరింటెండెంట్ ముత్తయ్య, నాయకులు ఆకుల బుచ్చిబాబు, తొడుసు లింగయ్య, కల్లెట్లపల్లి ఉప్పలయ్య, వెంకన్న, చిరంజీవి, రాంబాబు, కుమార్, ఉప్పలయ్య, సునీల్, మహేష్ పాల్గొన్నారు.

రాజకీయ నాయకులతో సమావేశం

నూతనకల్ : త్వరలో జరగనున్న గ్రామపంచాయతీ ఎన్నికల సందర్భంగా అఖిలపక్ష నాయకులకు మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ సునీత మాట్లాడుతూ.. గ్రామపంచాయతీల వారీగా పోలింగ్ కేంద్రాల ముసాయిదా జాబితా ప్రచురణ, అభ్యంతరాలపై నిర్వహించిన సమావేశంలో నాయకుల నుంచి పలు సలహాలు, సూచనలు అడిగి తెలుసుకున్నట్లు తెలిపారు. సమావేశంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నాగం సుధాకర్‌రెడ్డి, సీపీఐ మండల కార్యదర్శి తొట్ల ప్రభాకర్‌గౌడ్, బీజేపీ నాయకులు మాదిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, బంటు బద్రి, ఇమ్మారెడ్డి నవీన్‌రెడ్డి, ఎంపీఓ శశికళ తదితరులు పాల్గొన్నారు.

152పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు

అర్వపల్లి : గ్రామపంచాయతీ సాధారణ ఎన్నికలు–2024కు సంబంధించి పోలింగ్ కేంద్రాల ముసాయిదా జాబితాపై గురువారం మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో రాజకీయ నాయకులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ ఎం.సత్యనారాయణరెడ్డి పాల్గొని మాట్లాడారు. మండల వ్యాప్తంగా ఈ ఎన్నికలకు 152పోలింగ్ కేంద్రాలను వార్డుకు ఒకటి చొప్పున ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో ఎంపీఓ టి.గోపి, సీనియర్ అసిస్టెంట్ సీహెచ్.నరసింహరాజు, రాజకీయ నాయకులు గుండగాని సోమేష్‌గౌడ్, రింగు దయాకర్‌మౌర్య, చెరుకుపల్లి లక్ష్మణ్, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

మోడల్‌స్కూల్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

పెన్‌పహాడ్ : మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మండల పరిధిలోని అనాజీపురం ఆదర్శ పాఠశాలలో గురువారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా పీఎంటీఏటీఎస్ అధ్యక్షుడు గుండగాని రాజయ్యగౌడ్ మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించి మోడల్ స్కూళ్లను విద్యాశాఖలో విలీనం చేసి 010 పద్దు కింద వేతనాలు చెల్లించాలన్నారు. ఒకే నోటిఫికేషన్ కింద ఎన్నిక కాబడి, తగిన మెరిట్ అర్హత ఉన్నప్పటికీ అడ్మినిస్ట్రేటివ్ కారణాలతో దశల వారీగా నియామకాలు చేపట్టడంతో జరిగిన నష్టాన్ని నోషనల్ సర్వీస్ కల్పించి న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు గుర్రాల సోమయ్య, ఉపాధ్యాయులు గురుచరణ్, సూర్యగౌడ్, సంపత్‌కుమార్, వెంకన్న, జయంతి, వాసు, లింగయ్య, శైలజ, కిరణ్, సైదులు, రమాదేవి, ప్రమోద, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

పెన్‌పహాడ్ : మండల పరిధిలోని దోసపహాడ్ ఆవాసం జంగంపడిగె కాలనీకి చెందిన కడమంచి సాయమ్మ, గంగమ్మ, లక్ష్మమ్మ పూరి ఇండ్లు బుధవారం విద్యుదాఘాతంతో దగ్ధమయ్యాయి. గురువారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తూముల సురేష్‌రావు బాధిత కుటుంబాలను పరామర్శించి 4క్వింటాల బియ్యం, రూ.15వేలు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మొదటి విడతలోనే ఇందిరమ్మ ఇళ్లు వచ్చే విధంగా చేస్తామని బాధితులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సద్దల నగేష్, నారాయణ, ప్రవీణ్‌రెడ్డి, భిక్షంరెడ్డి, శివనాయక్, విద్యాసాగర్, వీరలింగం, వెంకట్‌రెడ్డి, శ్రావ్యరెడ్డి, నాగరాజు పాల్గొన్నారు.

నాగారం : మండల కేంద్రానికి చెందిన సీలోజు లక్ష్మీనారాయణ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. గ్రామానికి చెందిన శ్రీకృష్ణ యూత్ అసోసియేషన్ సభ్యులు గురువారం మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

నాగారం : రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని ఎస్‌ఐ ఎం.ఐలయ్య అన్నారు. గురువారం మండల కేంద్రంలోని సూర్యాపేట–జనగాం జాతీయ రహదారిపై వాహనాల తనిఖీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సురెన్స్, వాహనం రిజిస్ట్రేషన్ పత్రాలు తప్పనిసరిగా కలిగి ఉండాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడిపినా, పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సరైన ధ్రువపత్రాలు లేని వాహనాలను పట్టుకొని కేసులు నమోదు చేస్తున్నట్లు తెలిపారు. తనిఖీల్లో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.